**శ్రీ రమణ జ్యోతి**
ఫిబ్రవరి 2018
ఈ సంచికలో ...

**Sri Ramana Jyothi**
February 2018
IN THIS ISSUE ...

| | | | |
|---|---|---|---|
| 1. | **ఇతరులను సంతోషపెట్టడం ముఖ్యం** | డా॥ వి. రామదాస్ మూర్తి | **3** |
| 2. | **శ్రీ భగవాన్ పాద సన్నిధిలో** | జి. శ్రీహరిరావు | **10** |
| 3. | **భగవాన్ రమణుల దైవిక లీలలు** | మల్లాది ఫణిమాల | **13** |
| 4. | **అనిశ్చితి** | డా॥ వి. రామదాస్ మూర్తి | **16** |
| 5. | **భక్తుల ఆజ్ఞను పాటించిన దేవుడు** | శ్రీవత్సన | **22** |
| 6. | **Perfect Communication Occurs Through Silence Of The Mind** | Dr. K. Subrahmanian | **26** |
| 7. | ***Pramada* - The Other Name For 'Death'** | V. Krithivasan | **30** |
| 8. | **I and 'I-I' - A Reader's Query** | David Godman | **34** |
| 9. | **Pattinathar - The Saint Who Realised That Vairagya is the Greatest Wealth** | | **39** |

**శ్రీ రమణజ్యోతి వ్యవస్థాపకులు : కీ॥శే॥ డా॥ కె. సుబ్రహ్మణియన్**
**(వ్యవస్థాపక అధ్యక్షులు, శ్రీరమణకేంద్రం)**

**Editorial Board:** Telugu: **Dr. V. Ramadas Murthy, Malladi Phanimala, Katravulapalli Subbalakshmi**
English: **V. Krithivasan, N.S. Ramamohan, Sneha Choudhury**

# ఇతరులను సంతోషపెట్టడం ముఖ్యం

ఆంగ్ల మూలం: డా॥ కే.యస్. గారి 45వ ప్రవచనము

తెలుగు అనువాదం: డా॥ వి. రామదాస్ మూర్తి

## ప్రస్తుతానికే ప్రాధాన్యత

మనలో చాలామంది ప్రతిరోజూ భవిష్యత్తును గురించిన ఏవో ప్రణాళికలను వేస్తూంటాము. అవి విజయవంతమౌతాయా అని దిగులు పడుతూ వుంటాము. పాత రోజులను గురించి లేదా రాబోయే కాలం గురించి ఆలోచిస్తూ చాలా సమయాన్ని ఖర్చు చేస్తుంటాము. కాని మన చుట్టూ వున్న ఈ ప్రపంచాన్ని చూస్తే, జంతువులు, పక్షులు, చెట్లు, ఇతర కోట్లకొలది జీవులు భవిష్యత్తు గురించి పట్టించుకోవు. పిచుకలు, కాకులు, కుక్కలు, కోతులు మొదలైనవి రాబోయే కాలాన్ని గురించి ఏ ఆలోచనలూ పెట్టుకోవు. కాకి ప్రొద్దుటే, ఎగురుతూ పోయి ఏదో ఆహారాన్ని తెచ్చుకుని దాన్ని తినేసి సాయంత్రం నిశ్చింతగా గూడు చేరుతుంది. ప్రక్క రోజు కోసం ఆహారాన్ని నిలువబెట్టుకునే చింత దానికి వుండదు. నిజానికి, కాకి ఆహారాన్ని గమనించిన వెంటనే 'కావు, కావు' అని అరిచి ఇతర కాకుల్ని కూడ పిలుస్తుంది, ఆహారం తినమని. కోతులూ అంతే. తోటలోనికి వచ్చి, కనిపించిన పండునో, కాయనో తిని ఆ రోజుకు పని అయిపోయినట్లనుకుంటాయి. కాని, మనిషికి ఆహారాన్ని ఇస్తే, దానిని తీసుకుని మహా అయితే కుటుంబ సభ్యులతో పంచుకుంటాడు. నిలువ వుంచుకునే ప్రయత్నం చేస్తాడు. అంటే, జంతువులు, పక్షుల కంటే ఉన్నత వర్గానికి చెందిన వాళ్ళమనుకునే మనం, నిజానికి, వాటికంటే తక్కువనే అనుకోవాలి.

మానవేతర జీవులలో చాలా కొద్ది వర్గాలు మాత్రమే భవిష్యత్తు కోసం నిలువవుంచుకునే అలవాటును కలిగివుంటాయి. తేనెటీగలు ఈ రకానికి చెందుతాయి. అవి ఎంతో ప్రయాసపడి, తిరిగి, తిరిగి,

ఎన్నో పువ్వుల నుండి తేనెను సేకరించి పట్టులో నిలువజేస్తాయి. ఆ తేనెపట్టు నిర్మాణం గమనిస్తేనే మనకు ఆశ్చర్యం వేస్తుంది. అలా నిర్మించిన తేనెపట్టులో కొంచెం కొంచెంగా తీసుకొచ్చిన తేనెను నిలువ వుంచితే, మనిషి కాచుకు కూచొని, ఆ పట్టును తీసి దులిపేసి, తేనెను అంతా పిండుకుని పోతాడు. ఏవో ఇలాంటి జీవులు కొన్ని తప్ప చాలా వరకు ఆ క్షణాన్ని గురించి తప్ప భవిష్యత్తు గురించి మరేవీ ఆలోచిస్తూ, చింతించవు.

మనం మూడు పూటల, తిండి తింటున్నాము, ఉండేదానికి ఒక ఇల్లు ఉంది, నిజానికి, అవసరాల కంటే కొంచెం ఎక్కువే చాలా మందిమి కలిగివున్నాము. మరీ పూట గడవని నిరుపేదలం కాము. బ్రతకడానికి ఉన్నవి చాలునని తెలుసు. అయినప్పటికి, ప్రతిరోజూ ఇంకా ఎక్కువ ధనం, ఎక్కువ వస్తువులు సంపాదించాలి అన్న దురాశ కలుగుతూనే ఉంటుంది. దాని వెంటనే, ఆ ప్రయత్నాలు సఫలమౌతాయా, కావా అన్న దిగులు వెంటాడుతూ ఉంటుంది. యవ్వనంలో ఉన్నప్పుడు, సరే, పింఛను వస్తుంది, గ్రాట్యుయిటీ డబ్బు రిటైరు అయినప్పుడు ఇస్తారు, ఏమీ ఢోకా లేదు అని భావిస్తాము. కాని విశ్రాంతి దశ చేరినప్పుడు, ఇంకా ఓపిక కొంత ఉంది, మరికొంత శ్రమపడితే మరి కొంచెం సంపాదించవచ్చు అన్న ఆలోచన వస్తుంది. అంతకుముందు ఎక్కువ వచ్చేది కదా, అని అనుకుంటాము. దానంతట అదే లభిస్తే, అవకాశాన్ని వాడుకోవడం తప్పు కాకపోవచ్చు గాని, దానికోసం వెంపర్లాడడం, లభించకపోతే దుఃఖించడం మంచిది కాదు. కాని అలాగని ప్రతిసారి మనం అనుకునేవి ఎదురొస్తాయని భావించడం అవివేకము.

రాత్రింబగళ్ళు భవిష్యత్తును గురించిన ప్రణాళికలను వేస్తూ పోతుంటే మనం ప్రస్తుతాన్ని పూర్తిగా మరచిపోతాం. జరిగినదానిని గురించి, లేదా జరగబోయే దానిని గురించిన ఆలోచనలతో మన శక్తి

నంతటిని వ్యర్థం చేసుకుంటాము. అలాగాకుండ ప్రస్తుతం జరుగుతున్న దాని మీద పూర్తి శ్రద్ధ వహిస్తే, భూత, భవిష్యత్తుల ఆలోచనలు మనకు భారాన్ని కలిగించవు.

**ఇతరులను అగౌరవపరచడం తగదు**

ఒక్కొక్కసారి మనం పేపరు చదువుతూ వుంటాము, లేదా, టి.వి.ని చూస్తూ వుంటాము. ఆ సమయంలో ఎవరైన వస్తే, మనకు విసుగు వస్తుంది. అప్పుడు మనకు ఏ ఇతర అడ్డంకులు లేకుండా వుండాలను కుంటాము. వచ్చిన వారివల్ల మనకు సమయ భంగమైందని చిరాకు కలుగుతుంది. కాని వారు ఎందుకు వచ్చారో తెలుసుకుందామని శ్రద్ధ చూపితే, వెంటనే మన తీరు మారుతుంది. పూర్తిగా చెప్పదలచుకున్న విషయాన్ని వింటాము. అలా చేస్తే, అవతలి వ్యక్తికి తెలియకుండానే, ఎంతో విశ్రాంతి, ఊరట కలుగుతాయి. అంటే, మనం ప్రత్యేకించి ఏమీ చేయకపోయినప్పటికి, మనకు కూడ నెమ్మది, శాంతి లభిస్తాయి. ఊరికే కొంత సమయం వెచ్చించి వినడం వల్ల అవతలి వ్యక్తికి నెమ్మది కలిగించామన్న తృప్తి ఉంటుంది.

ఇది సాధ్యమా అని కొందరికి అనుమానం రావచ్చు. మన పిల్లల విషయం చూడండి. వాళ్ళు చెప్పింది అడ్డుపడకుండ పూర్తిగా జాగ్రత్తగా వింటే, మనకు ఎంతో ప్రేమ, జాలి కలుగుతాయి. తృప్తి కలుగుతుంది. బాధ ఉండదు. అలాగే ఇతరులు చెప్పేది శ్రద్ధతో వింటే, భగవంతుని దయతో మనకు తృప్తి కలుగుతుంది.

**నీ తీర్పును ఇతరులపై రుద్దకు**

ఈ సృష్టిలో ప్రతి ఒక్కరికి, ప్రతి వస్తువుకు, ఒక స్థానం ఉంది. మనం ఎవరినో తెలివితక్కువ మనిషిగా భావించవచ్చు. నీ దృష్టిలో అతడు తెలివితక్కువ వాడనుకున్నప్పటికి, అతనికి ఇతర ప్రత్యేకతలు ఉండవచ్చు. అతను ఒక మంచి చిత్రకారుడో, గాయకుడో అయి వుండవచ్చు. అలాగే అధ్యాపకుడు ఒక విద్యార్థిని ఎందుకూ పనికిరాని

వాడని అనుకోవచ్చు. ఇతర రంగాలలో అతని జ్ఞానం సంగతి మనకు తెలియదు. అన్ని విషయాలు తెలియదు గనుక మనం అలాగ అను కొంటున్నాము. ఏ పువ్వునో చెట్టునో అందంగా ఉందని, మరొకటి అలా కాదని భావించవచ్చు. అది నా తీర్పు, మానవ తీర్పు. కాని ఇతరుల అభిప్రాయం మరోవిధంగా ఉండవచ్చు. అందరి ఉద్దేశము మన దానితో ఏకమై ఉండాలని తలుస్తాము. అలా కుదరదు. నూటికి నూరు శాతం అందరూ ఒకే అభిప్రాయాన్ని కలిగి వుంటారన్నది జరగదు, ఏవో కొన్ని విషయాలలో తప్ప. ఉదాహరణకు అబద్ధం చెప్పేవారు కూడ అబద్ధం చెప్పడం తప్పు అని అంటారు. సత్యానికి ఉన్న విలువ అలాంటిది.

ఆచరించిన, ఆచరించకపోయిన, మనల్ని ప్రేమించే వాళ్ళను ప్రేమించడానికి ఇష్టపడతాము. కాని కొన్ని కారణాల వల్ల అలా చేయము. అప్పుడప్పుడు ఇతరులను ద్వేషిస్తాము. ఎవరినైన ద్వేషించి నప్పుడు శరీరంలో కొన్ని తీవ్రమైన మార్పులు ఏర్పడతాయి. శరీరం వేడెక్కిపోతుంది. అలా ద్వేషం పెంచుకున్న తరువాత మానసికంగా క్రుంగిపోవడం జరుగుతుందని కూడ మానసిక శాస్త్రజ్ఞులు చెబతారు. మన చుట్టు ప్రక్కల ఏమి జరుగుతున్నప్పటికి, మనసు ప్రభావితం కాకపోతే, శాంతి, నెమ్మది, సంతోషాలు చోటు చేసుకుంటాయి. మన కోసం కాకుండ, తిరిగి ఏమీ ఆశించకుండ మేలు చేసినప్పుడు సంతోషం కలుగుతుంది. ఇతరులకు సహాయం చేయడమంటే నిజానికి, నీకు నీవే సహాయం చేసుకొనడమని భగవాన్ చెప్పేవారు. మనము ఏవైన తిన్నప్పుడు మనకు మామూలుగా సంతోషం కలుగవచ్చు. ఇతరులకు సహాయము చేసినప్పుడు కలిగే ఆనందం వర్ణింపరానిది. జ్ఞానులు ఎప్పుడూ అదే స్థితిలో ఉంటారు. తమ ఆలోచనతో, స్పర్శతో, కంటిచూపుతో కూడ దీక్ష ఇచ్చి, అవతలి వ్యక్తిలో మార్పును తీసుకు రాగలరు.

## జ్ఞానుల సంకల్పం ఫలిస్తుంది

సామాన్యులము ఎన్నో ప్రణాళికలను వేసుకుంటాము. కాని తరచు అవి జరగవు. భగవంతుని ఇచ్ఛ ప్రకారం అన్నీ జరుగుతాయన్నది అర్థం చేసుకుంటే, ఏ ఒత్తిడీ ఉండదు, నిరాశ ఉండదు. ఒక్కొక్కసారి అనుకున్నది జరగకపోవడమే మంచిదైనదన్న అభిప్రాయానికి కూడ వస్తాము.

జ్ఞానుల సంకల్పము తప్పక యథార్థమౌతుంది. ఒకరోజు భగవాన్ నోటు పుస్తకం కావాలన్నారు. లేవు, అన్నీ అయిపోయాయని సహాయకులు చెప్పారు. ఆ సాయంత్రం కె.కె. నంబియార్ ఒక పుస్తకాన్ని తెచ్చి భగవాన్ ముందు ఉంచారు. భగవాన్ సహాయకునితో "నీవు తెమ్మన్నావా?" అని అడిగారు. తాను తెమ్మనలేదని అతడు అన్నాడు. అప్పుడు నంబియార్, "భగవాన్, రాత్రి నాకు కల వచ్చింది. ఆశ్రమానికి ఇలాంటి పుస్తకం అవసరమని తెలిసింది. అందుకే బజారుకు వెళ్ళి కొనుక్కొని వచ్చాను" అన్నారు. అలాగే, ఒక భక్తుడు భగవాన్‌తో "రెండు, మూడు రోజుల నుండి గమనిస్తున్నాను. మీకు మలబద్ధకంగా ఉన్నట్లు అనిపించింది" అన్నాడు. "దాని గురించి నీవెందుకు చింతిస్తావు?" అని భగవాన్ అంటే, "కాదు, కాదు, మీరు కొన్ని రోజులు కరక్కాయ గింజల కషాయం త్రాగాలి" అని బదులిచ్చాడు. ఆ సమయంలో అక్కడ ఉన్న ఒక భక్తుడు తాను బజారుకు వెళ్తున్నానని, ఆ గింజలు తాను తెస్తానని అన్నాడు. కాని అవి తేవడం మరచిపోయాడు. మరుసటి రోజు ప్రొద్దున ఆరు గంటలకు ఒక రైతు సంచీ నిండుగా కావలసిన ఆ గింజలను తెచ్చి నమ్రతతో భగవాన్ ముందు ఉంచి "భగవాన్, ఇవి మీకు అవసరమా?" అని అడిగాడు. అక్కడ ఉన్న ఒకరు వాటి అవసరాన్ని గురించి ఎవరు చెప్పారని అడిగితే, "ఎవరూ చెప్పలేదు, నేను చెంగం నుండి వస్తుంటే, దారిలో నా ముందు ఒక బండిలోని సంచులలో ఒక దాని రంధ్రంలో నుండి ఈ గింజలు పడుతుంటే

చూశాను. మీకెవరికైన పనికివస్తాయేమోనని వాటిని ఏరుకుని తీసుకొచ్చాను" అన్నాడు.

మన సంకల్పము మంచిదయితే, అది ఇతరుల సహాయం కోసం అయితే తప్పక ఫలిస్తుంది. అనుకోకుండ ఏ సందర్భంలోనో, ఎవరి ద్వారానో నిజమవుతుంది. అది ఈశ్వర నియతి. అప్పుడు మనకు సంతోషం కలుగుతుంది. భగవాన్ సమక్షంలో అలాంటివి ఎన్నో జరిగాయి. ఒక దేవాలయానికి వెళ్ళడానికో, ఎవరైన, సాధువుకు సహాయం చేయడానికో నిశ్చయించుకున్న సమయంలో అలాగ అనుకోకుండ ఫలిస్తుంది. ఒకరు కాశీకి వెళ్ళాలని ఎంతో కాలం నుండి అనుకుంటూ, అంతా సిద్ధం చేసుకున్న సమయంలో అకస్మాత్తుగా అతని భార్య జబ్బున పడింది. హృదయపూర్వకంగా ఆ యాత్ర చేయాలనుకున్న ఉద్దేశ్యం అలా నెరవేరలేదు. కాని, ఒక పదిహేను రోజుల తరువాత అతని సంకల్పం గురించి తెలియని వ్యక్తి ఒకరు కాశీ వెళ్ళి వచ్చి గంగా జలాన్ని కేంద్రంలోని సభ్యులకు అందరికీ పంచాడు. కాశీ వెళ్ళదలచుకున్న వ్యక్తి కన్నీటి పర్యంతమయ్యాడు. అది యాదృచ్ఛికంగా జరిగినప్పటికి, తన కోసం గంగాజలం ఉన్న చోటికే తేబడిందని సంతోషపడ్డాడు. అలాంటి సంఘటనలు జరుగుతూనే ఉండవచ్చు. కాని మనము వాటిని గుర్తించలేము. ప్రస్తుతం మీద మాత్రమే ధ్యాస ఉంచి, జరిగేవన్ని పైవాడి కృప వల్లనే అని గ్రహిస్తే మనకు ఏ విధమైన చింత ఉండదు.

### ఇతరులకు కొంచెమే ఇచ్చినప్పటికీ శ్రద్ధతో ఇవ్వాలి

మనము అవతలి వ్యక్తికి ఎంత ఇచ్చామన్నదాని కంటే, ఏ భావంతో ఇచ్చామన్నది ముఖ్యము. ఏ కొంచెం ఇతరులకు ఇచ్చినప్పటికి, శ్రద్ధతో మర్యాదగా ఇవ్వాలని ఉపనిషత్తులు చెబుతున్నాయి. ఇవ్వడమన్నది శ్రద్ధతోనే గాకుండ ఆడంబరం లేకుండ ఇవ్వాలి. కుడి చేతితో ఇచ్చినది ఎడమ చేతికి తెలియనవసరం లేదు.

దేవాలయానికి విరాళం ఇవ్వడం గురించి ఆలోచిస్తే, ఉదాహరణకు వేంకటేశ్వర స్వామికి ఏమి ఇవ్వగలము? మనకు ఇచ్చినదే మనం తిరిగి ఇవ్వగలం. అంతే. అది కేవలం నామ మాత్రమే. అందుకే శ్రద్ధ ముఖ్యం. కేంద్రం పేదలకు శరణాలయంలో అప్పుడప్పుడు గుడ్డలు మొదలైనవి పంచిపెట్టే కార్యం చేబడుతోంది. అలాగని మనం దేశంలోని మొత్తం దారిద్ర్యాన్ని రూపుమాపగలమా? ఇచ్చినది ఏ కొంచెమైనప్పటికి వాళ్ళు ఎంతో సంతోషంగా తీసుకుంటారు. దానివల్ల మనకు కలిగే ఆనందం మాత్రం ఎంతో గొప్పగా ఉంటుంది.

రమణాశ్రమంలో సాధువుల అన్నదానానికి భగవాన్ ఎంతో శ్రద్ధ కనబరిచేవారు. తాజాగా వున్న ఆహారాన్ని మాత్రమే వాళ్ళకు పంచాలన్నది తప్పక పాటించేవారు. ఇతరులను గురించిన అక్కఱ, అభిమానం చూపడం కూడ అవసరమనేవారు భగవాన్. వాళ్లను ఏ కొంచెం సంతోషపెట్టినప్పటికి, అది గొప్ప విషయముగా భావించాలి. తమ అనుకూలతను ఏ మాత్రం లెక్కచేయకుండ, ఎల్లవేళల, రాత్రి అనక, పగలనక భగవాన్ దర్శనం ఇచ్చేవారు. ప్రశాంతతను ఇచ్చే మహానుభావుని సన్నిధిలో ఉండడమే పరమ సుఖంగా భక్తులు భావించేవారు. ఇక ఆశ్రమ దర్శకులు రోజూ ఏదో ఒక ఆహార పదార్థం తీసుకుని వస్తుండేవారు. ఆరోగ్యానికి మంచిదైన, కాకపోయిన, ఎంతమంది ఇచ్చినప్పటికి, కొద్దికొద్దిగా తినేవారు. తరువాతి రోజుల్లో, తేబడిన ఆహారాన్ని వంటశాలలోనికి పంపించి, అందరు భక్తులతో బాటు తాము, కొద్దిగా ప్రసాదముగా తీసుకునేవారు. ఇతరులను సంతోషపెట్టడం ముఖ్యమని భావించేవారు. భగవాన్‌ను ఉదాహరణగా చేసుకుని బ్రతకాలంటే, భగవాన్ మాదిరిగానే బ్రతకాలి, అలాగే ఉండ గలగాలి.

*   *   *

# శ్రీ భగవాన్ పాద సన్నిధిలో (At the feet of Bhagavan)

ఆంగ్లమూలం: టి.కె. సుందరేశ అయ్యర్
(గత సంచిక తరువాయి)                తెలుగు అనువాదం: జి. శ్రీహరిరావు

## మౌనము-మనము నిర్దేశించుకున్నదా లేక ఆత్మ నియంత్రించినదా?

ఉన్నది ఒక్కటే సద్వస్తువు. దానినే శుభకరముగా 'వెలుగు' అనీ, సంపూర్ణమనీ, వైకుంఠమనీ, మౌనమనీ, కరుణ అనీ, ప్రజ్ఞ అనీ వర్ణిస్తుంటారు. వేరొక విధముగా నిర్వాణమనీ, నిశ్రేయమనీ సంబోధిస్తుంటారు. దీని లక్షణములైన జ్ఞానము, ఆనందము, తన్మయములను మన ఉనికికి మూలమైన హృదయముగా భావిస్తారు. ఈ సత్యము కరుణగా ప్రస్ఫుటమైనప్పుడు తనను తాను యీ దార్శనిక ప్రపంచము ద్వారా ప్రకటించుకుంటుంది. జాగ్రత్-స్వప్న-సుషుప్త్యావస్థల వెనుక దాగి యున్న తన్మయానందమే ఒక దివ్య నృత్యమువలే మనకు గోచరించును. అది మనకు నిత్యానుభవము.

యుగయుగాలుగా, మానవ ప్రయత్నమంతయూ, యీ అనంతానందమును అనుభవైక్యము చేసుకొనుటయే. దీనినే మనము తపస్సనుచున్నాము. ఈ ప్రయత్న ఫలితం యేదో సాధించడం కాదు. మనము ప్రయాణము చేయుచున్న వాహనాన్ని బలోపేతం చేసుకోవడమే. పరమేశ్వర కరుణలో మునిగిపోయి, అది తప్ప వేరొకటి లేదని తెలుసుకొనుటయే మన కర్తవ్యము. వాహనము పరిపక్వము కాగానే, కరుణలో మునిగిపోవుట, తత్సంబంధమైన అనుభూతి అంతయు వెంటనే జరిగి పోతాయి. ఆ పరిపక్వమైన వాహనమునే మహర్షి అనీ, సిద్ధుడనీ, జీవన్ముక్తుడనీ సంబోధిస్తాము.

**పరిణామము**

దాదాపు ఏభై ఆరు సంవత్సరముల క్రితం, అటువంటి మహా పురుషుడు యీ భూమిపై అవతరించాడు. సుమారు 16 సంవత్సరముల వరకూ సాధారణ జీవితము గడిపినట్లుగా కనిపించిన తరువాత, ఒక్కసారిగా జీవిత పరమార్థము వారిలోనుండి పెల్లుబికి నట్లుగా వచ్చి వారిని ముంచెత్తి వేసింది. వారి అంతర్ముఖత్వము ఊహా తీతమయిన లోతులకు తీసుకు పోయింది. ఆ స్థితిలో ఆత్మ తప్ప వేరొక్కటి లేదు. సూర్యుడు, చంద్రుడు, నక్షత్రాలు యేదీ ఆ స్థితిలో కానరావు. వీటంతటి కాంతినీ మించిపోయిన స్థాయి అది. ఆ కరుణలో ముంచెత్తబడిన శ్రీరమణులు అరుణాచలము వైపు తోయబడ్డారు. వారికి దశా నిర్దేశమయిన ఆ కాంతి పుంజము నిరంతరమూ, నిరాటంకమూ అయిన శక్తిగా వారిని నడిపించింది. నిశ్చలమయిన స్థితిలో వారు కూర్చొని పోయారు. మాట్లాడ గలిగినా మౌనియై వ్యవహరించారు. కళ్ళు తెరవ తలుచుకోక కాదు - కళ్ళు మూతబడి పోయినాయి. నడవ వద్దని కాదు - నడవలేక పోయినారు. ఫలానా వ్యక్తిగా మనము ఉదహరించే తను, అగోచరమైన ఒక అంతఃశక్తి నడిపించిన విధంగా నడుచుకున్నారు. ఆ అనుభవము దివ్యానంద భరితమూ, అనంతమయిన ప్రజ్ఞ అంతటినీ నింపివేసింది. ఆ నిండుతనమూ, పూర్ణత్వమూ, పరిపూర్ణమయిన శాంతిని ప్రతిబింబించు మౌనము. మహర్షిని మేలుకొలిపిన సద్దర్శనము. ఆ స్థితిలో 'నేను' అనేదేమీ మిగలలేదు.

ఆ విశాల ప్రపంచములో 'నేను' అనే బుద్బుదము అంత ర్థానమయి, అంతర్లీనమయి, ఆయన ఉనికి ఒక కొత్త రూపము సంత రించుకొని ఆనందభరితమైనది. పాత వాసనలన్నీ యీ సరికొత్త పరిణామములో మునిగిపోయినట్లయి ఆ రసాస్వాదన చేశాయి.

కుమారుని పరిణామ క్రమము పూర్తి అగునంతవరకూ, తండ్రి ఆయనను భద్రముగా తన గుండెలలో దాచుకుని బాహ్య ప్రపంచ వాసనలన్నిటి నుండి కాపాడు కున్నారు. మార్పు పూర్తి కాగానే బిడ్డకు స్వేచ్ఛనిచ్చి తన దగ్గరకు వచ్చిన వారందరితో ఆడుకోనిచ్చారు. కుమారుడు తండ్రి లక్షణాలన్నీ పుణికి పుచ్చుకొని, ఆయన వలె పర్వత ప్రాయమైనారు. తన వ్యక్తిత్వముపై యెవ్వరి వల్లనూ మచ్చపడదని పూర్తి నమ్మకము యేర్పరుచుకున్నాడు. అంతియే కాదు - తన సహచర్యము కోరి వచ్చిన వారందరూ, తన వలెనూ, తన తండ్రి వలెనూ మారిపోదురన్న ప్రగాఢ విశ్వాసమాయనకు యేర్పడెను.

## మౌనము నుండీ మాటల లోనికి

బాహ్య ప్రపంచ స్పర్శ కలుగగానే, తన తండ్రితో నిరంతర మౌన స్థితిలో అనుభవించిన దివ్యానుభూతి వల్ల మాటలాడు శక్తి పోగొట్టు కున్నానని గ్రహించారు. తన తండ్రి దివ్యధామమునకు తిరిగి వెళ్ళి పోవు స్వేచ్ఛా, అవకాశమూ తనకున్ననూ వారు ఆ మార్గము యెంచుకో లేదు. అల్పులూ దీనుల పట్ల వారికున్న కరుణ వల్ల, వారు కూడా వచ్చీ రాని మాటలతో పసి పాపవలే వారితో సంభాషించుటకు ప్రయత్నించారు. తండ్రి సన్నిధానము నుండీ బయటకు వచ్చిన కొత్తలో వారితో నున్న ధన్యులందరూ, మాటలాడుటకు శ్రీ భగవాన్ చేసిన ప్రయత్నములకు ప్రత్యక్ష సాక్షులు. మాటలాడుటకు వారు చేసిన యత్నములకు గొంతు సహకరించ లేదు. ఈ స్థితిలో ఎన్నో సంవత్సరములు గడిచినవి. ఇప్పుడు ప్రాచ్య, పాశ్చాత్య దేశముల నుండీ వారి దర్శనార్థము వచ్చు భక్తులందరికీ, శాంతి ప్రదాత అయిన వారి గొంతూ, అలౌకిక ప్రకాశముతో వెలిగిపోవు వారి కళ్ళూ, శ్రీ భగవాన్ దివ్య కర స్పర్శ స్వాంతన చేకూరుస్తున్నాయి. ఈ దివ్యకాంతీ, కరుణ వెలుగును కోరుకొనే మనందరికీ శాశ్వతముగా లభించుగాక! *(సశేషం)*

# భగవాన్ రమణుల దైవిక లీలలు

- మల్లాది ఫణిమాల

## 11. భక్తుని సమర్థుడిగా మలవడం

ఒకసారి భగవాన్ అణ్ణామలైస్వామికి ఆశ్రమ నిర్మాణ పనుల పర్యవేక్షణను అప్పగించారు. భగవాన్ సూచనలన్నిటిని బాధ్యతా యుతంగా అమలు చేయించడానికి, ఆయన రోజూ మండే ఎండలో నుంచుని పనిచేయించేవారు. నిర్మాణానికి కావలసిన సామగ్రి కొనుగోలు మొదలు సరియైన పనివారిని వెదకడం వరకు అన్ని బాధ్యతలు ఆయనే తీసుకోవడం చాలా కష్టసాధ్యమైన, సవాలుతో కూడిన పనిగా ఉండేది.

చాలాసార్లు అణ్ణామలై స్వామి "భగవాన్, నన్ను ఎందుకు ఇంత కష్టపెడుతున్నారు? మిగిలిన వారిలా నేను కూడా ధ్యానము చేసుకుంటూ ఆధ్యాత్మిక ప్రగతి కోసమే కదా ఇక్కడకు వచ్చాను. నా సమయమంతా ఈ పనిలోనే గడిచిపోతోందే ఎందుకు భగవాన్ నాకు ఇంత కష్టమైన పనిని ఇచ్చారు? అని తలచుకునేవారు.

ఒకరోజు అణ్ణామలై స్వామి ఈ ఆలోచనలలో మునిగి పరధ్యానము గా ఉండగా, భగవాన్ ఆయన ప్రక్కన నుంచుని మృదువైన స్వరముతో "నేను నీకు పనిని అప్పచెబితే నీవు దానిని పూర్తి నమ్మకముతో ముగిస్తావని అనుకున్నా. సక్రమముగా పని, జరుగుతుందని నిన్ను నమ్మవచ్చు అని నాకు అనిపించింది. ఒకవేళ నీకు శ్రమ ఎక్కువ అనుకొని వుంటే నీవు పని పూర్తి చేయనక్కర లేదు. నేను వేరొకరిని నియమిస్తాను" అన్నారు.

భగవాన్ యొక్క ఆ పలుకులు అణ్ణామలై స్వామి హృదయాన్ని స్పృశించగా భగవానుకు తన పట్ల గల అభిమానానికి చలించినవాడై కన్నీటితో, "భగవాన్ అప్పగించిన పనిని పూర్తి చేయడంలో నేను మరణించినప్పటికి అది నా అదృష్టంగానే భావిస్తాను. అందుచేత మీరు ఏమి చెప్పినను నేను చేస్తాను" అని భగవానుకు వినమ్రముగా తెలిపారు.

ఆ క్షణమునుంచి అణ్ణామలై స్వామి ఉత్సాహముతో పనులు చేస్తూ, చేయించుచూ ఉండేవారు. తరువాతి రోజుల్లో అతనికి ఎప్పుడూ వ్యతిరేక భావనలు కలుగలేదు.

గురుకార్యనిర్వహణను మించిన సేవలేదు.

## 12. భగవదేచ్ఛ

మానవాశి రామస్వామి అయ్యరుకు తిరువణ్ణామలై బదిలీ అయింది. ఆయన ఆఫీసు పని పూర్తి కాగానే భగవాన్ సమక్షానికి పరుగెత్తేవారు. అది గమనించి ఆయన అధికారి "నీకు 150 రూపాయల జీతము చాలా ఎక్కువ. ఎందుకంటే నీవు ఆఫీసులో ఉండి పని చేయడంలో కంటే భగవాను వద్ద అధిక సమయాన్ని గడపడానికి ఇష్టపడుతున్నావు" అని ఆటపట్టించేవారు. రామస్వామి అయ్యరు ఆ విషయాన్ని భగవానుకు చెబితే "నీ అధికారి ఇప్పుడిలాగ మాట్లాడు చున్నారు. ఒకవేళ నీ జీతము 200 రూ॥లయితే ఆయన ఏమంటారు?" అని భగవాన్ అడిగారు. ఆపై నెలకే రామస్వామి అయ్యరు జీతము 200 రూపాయలకు పెంచబడింది. అది అంతా భగవానుల లీల కాక మరేమి. భగవంతుని ఇచ్ఛ అంటే అదే.

## 13. తండ్రి, కొడుకు, ఇద్దరూ ఒకటే

ఒకసారి కీరపాటి ఇంట్లో దొంగ ప్రవేశించారు. ఆమె ఎవరక్కడ అని అరిచే సరికి ఆ దొంగ ఆమె గొంతు నొక్కి ప్రక్కకు తోస్తే ఆమె ''అణ్ణామలా'' కాపాడు, దొంగ'' అని అరిచింది. ఆ సమయంలో భగవాన్ స్కందాశ్రమములో వున్నారు. భగవాన్ ఆమె అభ్యర్థనకు బదులుగా ''నేను వస్తున్నాను'' అని బిగ్గరగా పలికి ముందుకురికారు. ఆశ్చర్యమేమంటే విరుపాక్ష గుహ, మామిడిచెట్టు గుహ, జడస్వామి గుహలు కొండ పాదము వద్దనే వున్నప్పటికీ, ఎవరికీ కీరపాటి అరుపులు వినిపించలేదు. నడిరాత్రిలో భగవాన్ కొండ దిగడం చూచిన పళనిస్వామి భగవానును అనుసరించి కీరపాటి ఇంటికి చేరారు. వాళ్ళు చేరేసరికి ఆమె ఒంటరిగా నుండడం చూశారు. వారు నవ్వుతూ ''అంత గొడవ ఎందుకు చేశావు, ఇక్కడ ఎవరూ లేరు, దుష్ట స్వప్నము కంటివా'' అని అడిగారు.

కీరపాటి ''కాదు స్వామి. అది కల కాదు. దొంగ సామానులన్నీ తీసుకొని పోయే ప్రయత్నిస్తుంటే నేను ఎదురు తిరిగాను. నన్ను ప్రక్కకు తోశాడు. అప్పుడే నేను పెద్దగా అరిచాను. మాకు ''నేను వస్తున్నా'' అని ఎవరో అనడం విని వెంటనే దొంగ పారిపోయాడు'' అని అనింది.

భగవాన్, పళనిస్వామి టార్చి వెలుతురులో చూస్తే బట్టలమూట, కొన్ని సామానులు చిందరవందరగా పడి వుండడం గమనించారు. నిజంగానే దొంగ వచ్చాడని నమ్మారు. కీరపాటి సహాయానికి అరుణాచలుని పిలిస్తే, ఆమెకు భగవాన్ ద్వారా సహాయమందింది. అంతే తండ్రి, తనయులిద్దరి మధ్య భేదములేదు ఇద్దరూ ఒకటే అని తెలుస్తోంది. కీరపాటి తనువు చాలించిన పిమ్మట ఆమె దేహాన్ని దక్షిణా మూర్తి గుడికి ఎదురుగావున్న చింతచెట్టు క్రింద సమాధి చేశారు.

# అనిశ్చితి

(మౌంటెన్‌పాత్ సంపుటి-51, సంచిక-4, (జూలై, సెప్టెంబర్ 2014) లో "ద అన్సర్టెన్టీ ప్రిన్సిపుల్" అన్న శీర్షికతో ప్రచురితమైన సంపాదకీయం యొక్క స్వేచ్ఛానువాదం) - డా॥ వి. రామదాస్ మూర్తి

## అనిశ్చితి మామూలు విషయమే

మనలో చాలామంది విషయంలో భగవంతుడిని గురించిన భావనకు, మానవజీవన అవసరాలకు, చాలా సూటియైన సంబంధం వుంది. ఆ అవసరాలలో మౌలికమైనది మన భద్రత. దేవుడు అని మనం భావించే ఏ నామం, రూపంలోనైనా సరే దయాపూరితము, ఉత్తమము అయిన ఒక శక్తి వుందన్న భావన కలిగి వుండడం సహజం. మనం శారీరక ప్రమాదం లేదా భావోద్రేక, మానసిక ఒత్తిడికి లోనైనప్పుడు ఆ భావన మరింత బలాన్ని పుంజుకుంటుంది. ఎన్నో గందరగోళాలు, అనిశ్చితులకు మధ్య నశించకుండ బతికిబట్టకట్టి వుండడానికి ఇది ఉపయోగపడే ఒక అనివార్యమైన దృక్పథం. మన ఉద్దేశంలో భగవంతుడంటే ఎంతో దయా స్వభావంతో ప్రార్థించినప్పుడు మనకు భయం కొలిపే పరిస్థితులను తట్టుకునే సామర్థ్యాన్ని ఇచ్చేవాడు; లేదా వీలైతే అసలు అలాంటివి సంభవించకుండ చేసేవాడు. అయితే, వివేకంతో ఆలోచిస్తే, ఆయన మొత్తం ప్రపంచాన్ని ఏ మాత్రమూ పట్టించుకోకుండ ప్రక్కకు నెట్టి, మన పక్షాననే తప్పకుండ వుంటాడన్న అభిప్రాయం ఎంత అసంబద్ధమైనదో అర్థమవుతుంది.

స్వర్గమంటే సకల బాధల నుండి ఓదార్పు లభించే స్థానంగా ఊహిస్తాము; అన్ని విచారాలు, సందిగ్ధతలను తొలగించుకుని, భగవంతునికి దగ్గరగా వుండాలని ప్రార్థిస్తాం. మనలో ప్రతి ఒక్కరికి స్వర్గాన్ని గురించిన ఒక వ్యక్తిగత ఊహాచిత్రం వుంటుంది. దాన్ని

సాధించడమే మన ధ్యేయంగా భావిస్తాము కూడ. లోలోపల మనసులో విషయాన్ని సరిగా తెలుసుకున్నామా లేదా అన్న అనుమానం ఇంకా కొంత ఉండనే వుంటుంది. కాని మన కష్టాలు, ఆదుర్దాల నుండి విముక్తి లభించిన వెంటనే మరచిపోయి, దాని గురించి పట్టించుకోము.

అందరమూ మన జీవితాలలో అనిశ్చితిని ఎదుర్కొంటూనే వుంటాం. మన యథార్థ స్థితి యొక్క స్వభావమే అది. ఏ విషయం గురించిగాని ఇది ఖచ్చితమైనది అని భావించలేము. కాని ఇదే అనిశ్చితిని మనం యథాతథంగా సక్రమమైన రీతిలో గుర్తిస్తే, ఆదుర్దాను తొలగిస్తుంది. ఎందుకంటే, అప్పుడు పరిస్థితులు ఎటువైపైన సరే మొగ్గ వచ్చు, ఎలాగైనా పరిణమించవచ్చునన్నది ఎఱుకలోకి వస్తుంది.

**అవగాహనకు, యథార్థానికీ తేడా**

విషయాలను, సంఘటనలను వున్నవి వున్నట్లుగా కాకుండ తాము అనుకొన్న విధంగా మాత్రమే చూడాలనుకోవడం మనిషికి ఎదురయ్యే ఒక ముఖ్యమైన సవాలు. మన అవగాహనకూ, యథార్థానికి మధ్య తేడా వుంటుంది. మన కంటే ఒక అతీతమైన శక్తి ఒకటి వున్నదన్న నమ్మకాన్ని మన బలహీనత కారణంగా మాత్రమే కాకుండ, అంతా సవ్యంగా వుంటుందన్న గాఢ నిశ్చయం ద్వారా ఏర్పరచుకుంటే, అనిశ్చితి యొక్క విలువ మనకు అర్థమవుతుంది. అలా జరగాలంటే మనం సులభంగా మనో వికారాలకు లోనవుతామని ఒప్పుకుని సందిగ్ధంలో వుండాల్సి వుంటుంది. అలాంటి పరిస్థితుల్లో అనుమానం విచక్షణకు తోడ్పడే పనిముట్టుగా మారుతుంది గాని మన నమ్మకాన్ని తుత్తునియలు చేసే ఒక ఖడ్గంగా మారదు. అనిశ్చితి అంటే జరగబోయేది మనకు తెలియదు అనే సంగతి గ్రహించి, నమ్రత ప్రకటిస్తూనే, ఎంత కఠినమైనప్పటికి విషయాన్ని ఎలాగైనా తెలుసు కోవాలన్న విశ్వాసంతో

కూడిన సంకల్పం కలిగి వుండడం.

ఎన్ని సందర్భాలలో వినాశకరమైనదిగా భావించిన ఒక సంఘటన తరువాత చేసుకున్న విమర్శల ఫలితంగా ఎంతో లాభదాయకమైనదని పునరాలోచనతో తెలియవచ్చిందో గమనించండి. ఆయా సందర్భాలలో ఏర్పడిన దిమ్మదిరిగే భయం మన ఎఱుకను పెంచి హృదయాన్ని గట్టిపరిచి, దృక్పథాన్ని మరింత విశాలం చేయడానికి తోడ్పడుతుంది. మార్పు అంటే భయపడరాదు. అలాగని చేయాల్సింది మొత్తం చేసేశామన్న సంతృప్తి కూడ పనికిరాదు. చేయాల్సింది ఎప్పుడూ ఇంకా వుండనే వుంటుంది. ''మేలుకో, లే, గమ్యం చేరే దాకా ఆగకు'' అన్న వివేకానందుని హెచ్చరిక మనకు గుర్తుకు వస్తుంది.

అనిశ్చితిని అంగీకరించడంవల్ల మనలో అణకువ హెచ్చుతుంది. విషయాల పట్ల అవగాహన పెరగాలని కోరుకుంటాం, గందరగోళాలు, గాభరాలు తొలగిపోవాలని ప్రార్థిస్తాం. మన ఆధ్యాత్మిక ప్రగతి మందకొడిగా సాగుతోందని కలవరపడవచ్చు. కాని ఆత్మ సాక్షాత్కారమన్నది ఏదో ఆషామాషీ వ్యవహారమని భావించరాదు.

### గురువు దగ్గర దాచినా దాగదు

గురువు దరి చేరేటప్పుడు భక్తిపూర్వకమైన భయాన్ని ప్రదర్శించాలి. సంపూర్ణ శరణాగతికై ప్రయత్నించే మార్గంలో మన జీవితాలలో మన అదుపులో లేని ఎన్నో శక్తులు ప్రముఖ పాత్రను పోషిస్తాయన్నది అనుభవంలోనికి వస్తుంది. భగవంతుడు మనకు ఏమి ప్రసాదించాలి, ఏమి ఇవ్వకూడదు అని మనం ఎన్ని ప్రార్థనలు చేసినప్పటికీ, యథార్థం ఎలా వుంటుందన్నది తెలుస్తూనే వుంటుంది. ఒక రకంగా అనిశ్చితి కారణంగా ఏర్పడే ఆదుర్దా వరంగానే భావించవచ్చు. ఎందుకంటే అది మనల్ని నిజాయితీపరులనుగా చేస్తుంది. శరణాగతి చేసినప్పటికీ,

దేవుడు, లేదా గురువు కూడ మన మాదిరిగానే ఆలోచిస్తారనుకోవడం ఎంత మూర్ఖత్వమో, ఏ ఒక్క విషయం లేదా సందర్భం ఇలాగే జరుగుతుంది అనుకోవడమూ అంత తెలివిలేనితనమే. గురువు మనకు ఏది ఉత్తమమో, ఏ విధంగా మన జీవితాల్ని రూపుదిద్దితే మన శ్రేయస్సుకు తోడ్పడుతుందని భావిస్తారో అలా చేయనివ్వడమే మనం చేయగల వివేకవంతమైన చర్య. ధృవతారలాగా గురువును నమ్ముకొనడం ఉత్తమం.

మనకు ఒంట్లో బాగులేనప్పుడు డాక్టర్ సలహా తీసుకుంటాం. డాక్టర్ దగ్గరకు వెళ్ళినప్పుడు మనకు అంతా బాగుందని చెప్పం. మనకు వుండే అన్ని బాధలు, లక్షణాలు చెబుతాం. గురువు మన గురించి అన్నీ తెలిసిన డాక్టర్. మన హృదయాల చీకటి కోణాలలోని ఏ విషయాన్నీ మరుగుపరచలేము. అలా చేయడం ఒక ఉపద్రవంగా మనం భావించరాదు. ఎందుకంటే గురువు మూర్తీభవించిన దయ, కరుణ. మనలోని మంచి విషయాలు మాత్రమే గాకుండ మన లోపాలు, దుశ్చర్యలను గురించి కూడ విన్నవించుకోవడం మన విధి. మనలో కోపం వుంటే దాన్ని తెలుపుకోవాలి. మనం స్వార్థపరులైతే దాని గురించి తెలియజెప్పాలి. ఎవ్వరమూ కూడ ఏ లోపమూ లేని స్వచ్ఛమైన వారము కాము. ప్రారంభ దశల్లో హృదయం విప్పి అన్నింటిని పూర్తిగా బహిరంగపరచడం జరగక పోవచ్చు. మన తప్పిదాలు, అపరాధాలను యదార్థంగా గుర్తించడం మొదలుపెడితే స్వేచ్ఛ, ముక్తికి సోపానం వేసే రాజమార్గాన్ని చేరుకున్నామని భావించవచ్చు. మనం ఎలాంటి వారమన్న యథార్థస్థితిని విశ్లేషించుకోవాలి. అందరి విషయంలో పరిస్థితి అలాగే వుంటుందన్న నిజం తెలిసినప్పుడు ఇలా నా కొక్కడికే జరుగుతోంది అన్న భావన నశిస్తుంది. సముద్రపు అంచున నిలబడిన

వారి అందరిపైన అలలు విరుచుకుపడుతూనే వుంటాయి. అలాగే అనిశ్చిత పరిస్థితి ఏదో మనకొక్కరికే అన్వయిస్తుందన్న భావన తప్పు అని ఎఱుకకు వస్తుంది.

**భారమంతా గురువు మీదే వుంచాలి**

పరస్పర విరుద్ధ శక్తుల ప్రభావాలకు లోనయ్యే మానసిక, భావోద్రేక స్థితులను క్షుణ్ణంగా గమనిస్తే భారమనుకునేదాన్ని వదలించుకోవడం సులభమవుతుంది. రైలులో ప్రయాణించే వ్యక్తి తన నెత్తి మీద బరువైన మూటను బండిలో వుంచి ప్రయాణం సుఖంగా సాగించడాన్ని గురించి భగవాన్ రమణమహర్షి చెబుతుండేవారు. అలాగని తమ బాధ్యతలను తోసిరాజని పట్టించుకోకుండ వుండడం సరికాదు. ప్రతి క్షణంలో గమనికతో ఏమి చేయాలో తెలుసుకుని సరియైన చర్య తీసుకొనడం అవసరం. మనం కర్తలం అన్న భావాన్ని పూర్తిగా త్యజించడమే దాని అర్థం.

భగవద్గీతలోని తొమ్మిదవ అధ్యాయంపై చేసిన వ్యాఖ్యానంలో జ్ఞానేశ్వర, గురువు క్షమించలేనంతటి పాపం ఏదీ వుండదన్నారు. ''మొదట్లో మనిషి ఎన్నో పాపకర్మలు చేసివుండినప్పటికి, నాపైన నమ్మక ముంచితే ఉత్కృష్ట జీవిగా మారి, సముద్రంలో మునుగుతున్న వ్యక్తి చావును తప్పించుకునేలాగ రక్షింపబడతాడు. గురువు కృపావీక్షణం నుండి ఏదీ తప్పించుకోలేదు'' అన్నారు. నిష్కపట సాధకులు నిష్కారణంగా ఎంతో బాధపడడం, వేదన పడడం గమనిస్తూ వుంటాం. అదే సమయంలో తమకు, ఇతరులకు కూడ జీవితం భారమయ్యేలా ప్రవర్తించే వ్యక్తులూ కనిపిస్తారు. సాధనామార్గంలో మరికొందరు ఎంతో ప్రగతి సాధిస్తుంటే తాము వెనుకబడి పోయామన్న భావనతో క్రుంగిపోయే వారినీ గమనిస్తుంటాం. ఒక్కొక్కసారి మనమెంతో ప్రగతి

సాధించామని సంతోషిస్తాం. అద్వైత సిద్ధాంతం ప్రకారం మనం ఇప్పటికే 'అది' - 'తత్ త్వం అసి''. ఒక్క జ్ఞాన వృత్తి మనల్ని అన్నిటి నుండి విముక్తులను చేస్తుంది. శివుడిని చెన్నమల్లికార్జున రూపంలో ఆరాధించిన వీరశైవ సాధ్వి అక్కమహాదేవి జీవితంలో శంకలు, అనుమానాలు, అనిశ్చితి గురించి ఇలా నమ్మింది:

మట్టిలో దాగిన మాణిక్యంలా
ఫలంలో నిక్షిప్తమైన రుచిలా
పాషాణంలో గుప్తంగా వున్న బంగారంలా
నువ్వు గింజలో దాక్కున్న నూనెలా
చెట్టులో అణిగివున్న నిప్పులా
దుఃఖతప్తులలో మరుగైన బ్రహ్మం
చెన్నమల్లికార్జునుని
ఎవ్వరూ గమనించలేరు.

*　　　*　　　*

**దక్షిణామూర్తి ప్రభో! ఎంత దయామయుడవయ్యా మానవ రూపాన్ని ధరించి మానవాళిని మీ బోధనతో ఆశీర్వదించావు. సత్యం, శివం, సుందరం వీటి రూపమైన శ్రీ భగవాన్‌కి నా ప్రణామములు! పునః ప్రణామములు!**

*(స్వామి దేశికానంద - శ్రీరమణ మహర్షితో ముఖాముఖి)*

# భక్తుల ఆజ్ఞను పాటించిన దేవుడు

(శ్రీరమణజ్యోతి (ఏప్రిల్ 2016 సంచిక)లో శ్రీ వి. కృత్తివాసన్ రచన "ఐయామ్ అవైటింగ్ యువర్ కమాండ్ "సేస్ ద లార్డ్" అన్న వ్యాసం యొక్క అనువాదం)

అనువాదం: శ్రీవత్సస

భగవంతుని సౌలభ్యానికి సంబంధించిన గాథలు భక్తి సాహిత్యంలో ఎన్నో కనిపిస్తాయి. అన్ని బంధాలకు అతీతుడైన ప్రభువు భక్తుని ప్రేమకు కట్టుబడతాడు. భగవంతుడు కొన్ని శతాబ్దాల క్రితం ప్రదర్శించిన లీల ఒక కథ రూపంలో మనకు తెలియవస్తుంది.

పల్లవరాజ్యాన్ని నందివర్మ పల్లవ రాజు పాలిస్తున్న రోజుల్లో ముఖ్య పట్టణమైన కాంచీపురంలో తిరుమళిశై ఆళ్వార్ అన్న ఒక గొప్ప వైష్ణవ గురువు ఉండేవాడు. అతను కాంచీపురంలోని విష్ణు ఆలయంలో ప్రధాన అర్చకుడు. తన మొత్తం కాలాన్ని విష్ణువును గురించిన స్తుతి పద్యాలు వ్రాయడంలోను, పూజా కార్యక్రమాలలోను, దైవధ్యాసలోను గడిపేవాడు. కనికణ్ణన్ అన్న ఒక చిన్న బాలుడిని అతడు తన శిష్యునిగా చేర్చుకున్నాడు. కనికణ్ణన్‌కు భక్తి యోగాన్ని బోధించేవాడు. అతి చురుకైన ఆ శిష్యుణ్ణి చూసి ఆళ్వార్ ఎంతో గర్వపడేవాడు.

ఒకరోజు కనికణ్ణన్‌కు ఆలయంలో ఒక వృద్ధ స్త్రీ కనిపించింది. పెద్ద వయసుతో ఆమె నడుము వంగిపోయి వుంది. సన్నగా, చాలా నీరసంగా ఉంది. అలాంటి పరిస్థితుల్లో కూడ ఆమె ఆలయ ప్రాంగణాన్ని ఎంతో కష్టాన్ని ఓర్చుకుని శుభ్రం చేస్తూ ఉండడం కనికణ్ణన్‌కు ఆశ్చర్యం కలిగించింది. దానిని గమనించిన కనికణ్ణన్ ఎంతో చలించిపోయి ఆమె వీపును ఆప్యాయంగా తాకాడు. వృద్ధ స్త్రీ పట్ల బాలుడు చూపిన మెప్పుదల, కనికరం కారణంగా ఒక అద్భుతం

ప్రకటితమైంది. అతని కళ్ళెదుటే ఆమె ఒక అందమైన యువతిగా మారింది! తనకు యౌవనం తిరిగి ప్రాప్తించినందుకు ఆమె ఎంతో సంభ్రమపడింది. దైవభక్తి అమితంగా ఉన్నందున ఆమె ప్రభువును మరింత శక్తిసామర్థ్యాలతో సేవించాలని నిశ్చయించుకుంది.

ఆ స్త్రీ ప్రాయంలో ఉన్నప్పుడు పల్లవరాజు ఆస్థానంలో నర్తకిగా ఉండేది. ఆమె తిరిగి యువతిగా మారిన విషయం రాజుగారి చెవిన పడింది. రాజుకు అప్పటికి ముసలితనం వచ్చేసింది. తాను కూడ యువకుడిగా మారితే ఎంత బాగుంటుందన్న ఆలోచన ఆయనకు వచ్చింది. ఆమె నర్తకిగా ఉన్న రోజుల్లో తాము గడిపిన ఆనంద క్షణాలను నెమరేసుకున్నాడు. ఆ ఆలోచన బాగా ముదరడంతో, అద్భుతాన్ని చేసిన ఆ బాలుడిని తన వద్దకు తీసుకు రావలసిందిగా ఆజ్ఞాపించాడు. రాజాజ్ఞను శిరసావహించి కనికణ్ణన్ ఆస్థానానికి వచ్చాడు. రాజు తన కోరికను తెలపడంతో కనికణ్ణన్ నవ్వాడు. "ఏ అర్హత ఉన్నదని మీరు యౌవనాన్ని తిరిగి పొందాలని అనుకుంటున్నారు?" అని నిర్భయంగా అడిగాడు. "ఆ అద్భుతం అలా జరిగింది, అంతే. అది మా గురుకృప వల్ల, దైవసేవ తప్ప మరే ఇతర ధ్యాస, ఇచ్ఛలేని ఆమె భావన కారణంగా జరిగింది. దానికి నేను ఒక పనిముట్టును మాత్రమే. మీ విషయం వేరు. తిరిగి యువకుడు కావాలన్న దుష్టమైన ఆశ మీకు ఉంది. అందుకే లాంటి అద్భుతం మళ్ళీ జరగదు" అన్నాడు. కనికణ్ణన్ అలా నిర్మొహమాటంగా జవాబిచ్చేసరికి రాజుకు చెప్పరాని కోసం వచ్చింది. కనికణ్ణన్‌ను దేశం నుండి బహిష్కరించాలని ఆజ్ఞాపించాడు. 'మీ రాజ్యంలో ఉండడం నాకూ ఇష్టం లేదంటూ కనికణ్ణన్ అక్కడి నుండి వెళ్ళిపోయాడు.

ఆలయానికి తిరిగి వచ్చిన కనికణ్ణన్ గురువు గారితో జరిగినదంత

చెప్పి, ఊరు వదలి వెళ్ళడానికి సిద్ధమయ్యాడు. తమ రక్షణ నుండి శిష్యుడు వెళ్ళిపోవడం ఆళ్వార్‌కు ఇష్టం లేదు. అందుకే తాను కూడ కనికణ్ణన్ వెంబడి వెళ్ళిపోయేందుకు నిశ్చయించుకున్నాడు. కాని విష్ణుమూర్తిని వదలి తాను ఎలా వెళ్ళగలడు? ఆళ్వార్ గర్భగుడికి వెళ్ళి ఆదిశేషునిపై పవళించి వున్న ప్రభువును ఉద్దేశించి ఒక పద్యంలో, “ప్రభూ కనికణ్ణన్ వెళ్ళిపోతున్నాడు. అతని వెంబడి నేను వెళ్ళాల్సి వుంది. మీరు ఇక్కడ ఎలా ఉండగలరు? మీ సర్పశయ్యను చుట్టుకుని మాతో కూడ రండి” అని అన్నాడు. అలాగ ఆజ్ఞాపింపబడేసరికి, పడగలను విప్పిన ఆదిశేషుడు తన ఛత్రముగా వెంట రాగా ప్రభువు ఆళ్వార్, కనికణ్ణన్‌లను వెంబడించాడట! ఆదిశేషునితో సహా అందరూ కాంచీపురం పరిసరాలలోని పాలారు నదీ తీరంలో ఒక గ్రామం చేరే సరికి రాత్రి అయింది. అక్కడ మకాం పెట్టారు. ఆ స్థలానికి అప్పటి నుండి “ఒరిరపు ఇరుక్కై” (ఒక రాత్రి విశ్రాంతి స్థలం) అన్న పేరు వచ్చింది.

ఈలోగా అక్కడ కాంచీపురంలో పలు అపశకున లక్షణాలు కనిపించసాగాయి. ఎక్కడ కూడ దీపం వెలగలేదు. చీకటితోపాటు ప్రజలందరూ చెప్పలేని భయంతో తల్లడిల్లారు. ఆలయంలో విగ్రహం లేదన్న సంగతి తెలుసుకున్న ప్రజలు రాజమందిరానికి పరుగున వెళ్ళి జరిగిన విషయం చెప్పారు. తన తప్పిదాన్ని గుర్తించిన రాజు విష్ణు మూర్తిని వెతకడానికి బయలుదేరాడు. ఉదయాన్నే విష్ణుమూర్తితో సహా అందరిని నది దగ్గర కనుగొన్నారు. రాజు దేవుని కాళ్ళ మీద పడి క్షమాపణ కోరి కాంచీపురానికి తిరిగి రమ్మని ప్రార్థించాడు. విష్ణుమూర్తి యథాలాపంగా “నన్ను అడగకు, నిశ్చయించాల్సింది ఆళ్వారే” అన్నారు. రాజు ఆళ్వార్‌కు ప్రణమిల్లాడు. ఆళ్వార్ కూడ “నన్ను కాదు, కనికణ్ణన్‌ను

ఒప్పించాలి'' అన్నాడు. మరొక మార్గం లేక రాజు కనికణ్ణన్‌కు దండం పెట్టి, దయచేసి అందరూ కాంచీపురానికి తిరిగి రావలసిందని బ్రతిమాలాడు. రాజు గుణపాఠం నేర్చుకున్నాడని నమ్మిన కనికణ్ణన్ అతనిని క్షమించాడు. అందరూ కాంచీపురం చేరారు.

కాని, కథ ఇక్కడితో ముగియలేదు. ఆలయానికి తిరిగి వచ్చిన ప్రభువు ఇంకా నిలబడి వున్నట్లు ఆళ్వార్ గమనించాడు. ఎందుకని ఆళ్వార్ అడిగితే, "నన్ను శయ్య మీద పడుకోమని నీవు ఇంకా చెప్పలేదు కదా!'' అన్నారట. అప్పుడు ఆళ్వార్ మరొక పాట పాడుతూ, "ఓ! ప్రభూ! కనికణ్ణన్ వాపసు వచ్చాడు. నేను కూడ ఇక్కడే ఉంటాను. మీరు ఇక సర్పశయ్యను పరచుకుని విశ్రమించవచ్చు'' అన్నాడట. ఆ తరువాతనే విష్ణుమూర్తి మళ్ళీ తమ మామూలు తీరులో పడుకున్నాడు.

పై సంఘటన జరిగిన తరువాతి నుండి విష్ణువు "యథోక్తకారి'' (చెప్పినట్లు చేసినవాడు) అని ప్రసిద్ధి పొందాడు. కాంచీపురం వెళ్ళిన వారు ఈ ఆలయాన్ని తప్పక దర్శించి హృదయాలలో తన పట్ల పవిత్ర భక్తిని ప్రదర్శించే భక్తులపై అత్యంత ప్రీతిని చూపే ఆ దేవుని కరుణను స్మరించుకోవచ్చు. నిష్కామ ప్రేమతో ఆయనను బంధించవచ్చు.

## శ్రద్ధాంజలి

హైదరాబాదు శ్రీ రమణకేంద్రము స్థాపకులలో ఒకరైన మరియు శ్రీరమణజ్యోతి మాజీ ప్రచురణకర్త ఐన శ్రీ సి.వి.కె. మూర్తిగారు జనవరి 12, 2018న పరమపదించారని తెలియచేయుటకు చింతిస్తున్నాము. ఆయనకు ఇద్దరు కుమార్తెలు, ఒక మనవడు కలరు. వారి ఆత్మకు శ్రీ భగవానుల పాదసన్నిధియందు శాంతి కలుగవలెనని ప్రార్థించుచున్నాము.

# Perfect Communication Occurs Through Silence of the Mind

(Dr.K.Subrahmanian - Talk 5A)

Pranava is OM. That is *Shabda* (sound) and shabda is very important. When you say the word Eswara, there is a shabda and also *artha* (meaning). You can't separate word and its meaning- they are always together. When the word has no meaning, you call it as noise. Noise is disorganized sound. When we speak, the other person is able to hear. Not only hear, he is able to understand. In our normal speech, the words used and their sense are together. However, we also like pure sound without any meaning. And that pure sound without any meaning is music. There are only seven *swaras;* these seven swaras in various combinations form the ragas, the melodies. When you hear music, you are taken to a different world altogether. That's why we say, *naada Brahmam, shabda Brahmam.* Naada is musical sounds. Shabda itself is Brahman.

The verse on Lord Dakshinamurthy goes like this:

**ओं नमः प्रणवार्थय शुद्ध ज्ञानैक मूर्तये ।**

**निर्मलाय प्रशान्ताय दक्षिणामूर्तये नमः ॥**

*Om Namah Pranavaarthaaya Suddha jnanaika murthaye*

*Nirmalaya prashantaaya Dakshinamurthaye Namah*

Om namah pranavaarthaya: Dakshinmurthy is the embodiment of pure Brahmam.

Suddha Jnaanaika Murthaye : Who is also the embodiment of Pure Jnana ; nirmalaya : spotless, without disfigurement of any kind whatsoever. He is absolutely pure. Prashantaaya-always cheerful; Dakshinamurthayenamaah: I bow down to that Dakshinamurthy.

When two people meet for the first time, an exchange of information about themselves takes place through questions and answers. In the next meeting they simply follow up about themselves. When they get to know each other very well, much less is spoken and they can be together without much talk. When one is silent in the first meeting itself, there is an uncomfortable silence. Each one expects the other to break the silence. This is what happens in our day to day life. When you meet a great person, you hesitate to talk to him, because you are not sure how he will take it. But when you see a great person surrounded by a crowd, and he himself talks to you without your making any effort, you are very happy, you are pleased. This does not come to everyone naturally; that kind of attitude is possible only if one has a certain measure of humility. One of the great attributes of Sri Rama was, he was a *purva Bhaashi,* that is*,* if He met anyone He would talk to him first, without waiting for the other to break the ice. Not only that, He was also a *Mrudubhashi*-soft spoken. Sri Rama was not a person who asserted Himself, but He made you comfortable by talking to you first and then talking to you in a very soft way.

